

సాకారం దిశగా అడుగులు

- భద్రాద్రి రామాలయ అభివృద్ధికి తుది సర్వే ప్రారంభం
- తొలి రోజున 46 ఇళ్లకు గాను 34 ఇళ్ల కొలతల పూర్తి
- మెరుగైన ప్యాకేజీ, మూడు సెంట్ల స్థలం ఇవ్వాలంటున్న నిర్వాసితులు

భద్రాచలం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం రామాలయ అభివృద్ధి సాకారం దిశగా అడుగులు పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న క్రమంలో ఇప్పటికే భూ సేకరణకు రూ.60.20 కోట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించి ఇటీవలె రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో నెం.246ను జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో భాగంగా ఈ పనులను చేపడుతున్నారు. ఇందుకోసం భద్రాచలం గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభను సైతం నిర్వహించారు. కాగా శనివారం రామాలయ అభివృద్ధికి స్థల సేకరణ కోసం తుది సర్వే ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇళ్ల స్థలాల కొలతలు సేకరణ చేపట్టారు.

మొత్తం 46 ఇళ్లను తొలగించాల్సి ఉంటుందని నిర్ణయించగా ఇందులో 34 ఇళ్లకు సంబంధించిన కొలతలను భద్రాచలం రెవెన్యూ, గ్రామ పంచాయతీ, దేవాదాయ శాఖ అధికారులు సంయుక్తంగా సేకరించారు. ఆదివారం మిగిలిన 12 ఇళ్ల కొలతలు సేకరించనున్నట్లు పేర్కొంటున్నారు. ప్రాథమిక సర్వేను మ్యాపు ద్వారా పరిగణలోకి తీసుకొని తుది సర్వే అధికారులు చేపడుతున్నారు.

మెరుగైన ప్యాకేజీస్థలం

అభివృద్ధికి తాముపూర్తిస్థాయిలో సహకరిస్తామని అత్యధికశాతం నిర్వాసితులు పేర్కొంటున్నారు. అయితే తమకు మెరుగైన ప్యాకేజీ ప్రభుత్వం అందించాలని వారు కోరుతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి యజమానికి 70 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించనుందని పేర్కొంటున్న క్రమంలో తమకు మూడు సెంట్ల స్థలం ఒక్కొక్కరికి ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ రెండు కీలక అంశాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

ఫటా ఫట్

ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

● రాయరాల ఆశాలత, ఖమ్మం డీపీవో



ప్రశ్న: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. క్షేత్రస్థాయిలో అనుకున్న విధంగా పారిశుధ్య చర్యలు ఉండటం లేదు.. ఎందుకలా?

జవాబు: పంచాయతీ సెక్రటరీలు, ఎంపీవోలు, వైద్యసిబ్బంది సమన్వయంతో వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిన చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం.

ప్ర: ట్యాంకులు శుభ్రం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి..?

జ: కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీలో ప్రతీ నెల 1, 11, 21 తేదీల్లో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేస్తున్నాం. బ్లీచింగ్ పౌడర్ కావాల్సినంత అందుబాటులో ఉంది. నీటి ట్యాంకులు శుభ్రం చేయకుంటే ప్రజలు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయొచ్చు.

ప్ర: ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించడానికి కూడా డబ్బులు లేవంటున్నారు..?


జ: అదేం లేదు. ఇటీవలె రూ.8 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. వీటిలో ట్రాక్టర్ల ఈఎంఐలకు రూ.కోటి 31లక్షలు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలకు రూ.3 కోట్లు, కరెంటు బకాయిలు.. ఇలా అన్ని చెల్లింపులు చేశాం.

ప్ర: ఇంటిపన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయా?


జ: నిజమే, ఇప్పటి వరకు 30శాతం మాత్రమే వసూలు అయ్యాయి. పంచాయతీ కార్యదర్శుల బదిలీలు, ఇతర కారణాలతో వసూలు కాలేదు. అయితే నియోజకవర్గాల వారీగా పన్నుల వసూళ్లపై దృష్టి సారించాం. నవంబర్ 15 నాటికి పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నది లక్ష్యం.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 20 అక్టోబరు 2024



పోలీస్ అంటూ.. దోచేస్తారు..

సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు.. దర్జాగా పోలీస్ డిపార్ట్‌మెంట్ పేరు చెబుతారు.. క్రైం బ్రాంచి నుంచి కాల్ చేస్తున్నామంటారు. కేసు నమోదైందని హెచ్చరిస్తారు. మరుసటిరోజు పలానా సమయానికి కోర్టులో హాజరుకావాలని హుకుం జారీ చేస్తారు. వారు చెప్పిన మాటలు నమ్మి బెదిరిపోతే బెంబేలెత్తించేస్తారు. చెప్పినట్టు వింటే అదిరించి అందినకాడికి దోచేస్తారు. గత కొద్ది రోజులుగా సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న నేరాల తీరు ఇది. పోలీసుల మాదిరి వేషాలు వేసి ముంబై, ఢిల్లీ పోలీసుల పేరుతో సామాన్యులకు ఫోన్లు చేసి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. వారి భాష, వ్యవహార శైలి అచ్చం పోలీసులు మాదిరిగానే అనిపిస్తుడటంతో విద్యావంతులు సైతం మోసపోతున్నారు.

బీ అలర్ట్...

- సైబర్ నేరగాళ్ల కొత్తపుంతలు
- నకిలీ ఐడీ కార్డులు, ఎఫ్ఐఆర్‌లతో బెదిరింపులు
- వీడియో కాల్ చేసి మరీ హెచ్చరికలు
- ఒక్కొక్కరికి ఒక్కో కారణం చెబుతూ మోసం
- ఆన్‌లైన్‌లో ఉండగానే డబ్బులు బదిలీ చేయించుకుంటున్న వైనం
- ముంబై, ఢిల్లీ పోలీసుల పేరుతో వైట్‌కాలర్ నేరాలు
- జిల్లాలో ఇప్పటికే పలువురు బాధితులు
- అప్రమత్తంగా లేకపోతే నట్టేట మునిగినట్టే...

ఖమ్మం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'హలో.. మేము ముంబై క్రైం బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ సిమ్ కార్డు మరో 30 నిమిషాల్లో బ్లాక్ అయిపోతుంది. మీ ఆధార్ కార్డు మీద ఉన్న మరో సిమ్‌తో పోర్నోగ్రఫీ కంటెంట్ షేర్ చేస్తున్నారు. మీ పేరు మీద కేసు రిజిస్టర్ అయింది. వెంటనే మీరు బయలుదేరి ముంబైకి రావాల్సి ఉంటుంది. అవన్నీ చేసింది మీరు కాదు అంటున్నారు కాబట్టి, మీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకుని కోర్టుకు నివేదిస్తాం. కాకపోతే కోర్టు ఫీజు కోసం లాయర్‌కు రూ. 50వేల వరకు ఖర్చవుతుంది. అవి ఇప్పుడు పంపితేనే మేము దాన్ని కొట్టేయగలం' ఇవి కొద్ది రోజుల క్రితం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి వచ్చిన ఫోన్‌లో మాట్లాడిన మాటలు. సదరు ఉపాధ్యాయుడు ఫోన్ మాట్లాడుతున్న సందర్భంలో ఉన్నతాధికారికి కాల్ బదిలీ చేస్తామని చెప్పిన అనంతరం మరో వ్యక్తి ఏకంగా వీడియోకాల్ చేసి మాట్లాడాడు. ఆ సమయంలో ఆ వ్యక్తి ఉన్న గది అచ్చం పోలీస్ కార్యాలయంలాగానే కనిపించింది. అనుమానం వచ్చిన సదరు ఉపాధ్యాయుడు అవతలి వ్యక్తులను పలు ప్రశ్నలు వేయడంతో పాటు తనకు తెలిసిన వారిద్వారా అది ఫేక్ అని నిర్ధారించుకోవడంతో ఆయనకు ఎలాంటి నష్టం జరగలేదు.

మరో సంఘటనలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ కుమారుడిపై కేసు నమోదయిందనీ, అరెస్ట్ చేశామనీ చెబుతూ విడిచి పెట్టాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో ఉన్న వరకు వెంటనే బ్యాంకుకు వెళ్లి వేయాలని సూచించారు. దీంతో అనుమానం వచ్చిన ఉద్యోగి ఖమ్మంలోని సైబర్ సెల్ పోలీసులతో అది మోసగాళ్ల పనిగా నిర్ధారించుకున్నాడు.

ఇలా ప్రతీ రోజూ జిల్లాలో ఎవరికో ఒకరికి ఇలాంటి అనుభవం ఎదురవుతూనే ఉంది. పోలీసుల పేరుతో ఫోన్లు చేసిన సదరు వ్యక్తులు మాత్రం ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన కారణం చెప్పడం కొసమెరుపు. అందుకోసం మాదక ద్రవ్యాల నుంచి మొదలుకుని, పోర్న్ సైట్ల వరకు అన్నింటినీ తమ నేరాల్లో భాగంగా ఉపయోగించుకుంటున్నట్టుగా తెలుస్తోంది.

నకిలీ ఐడీ కార్డులు, ఎఫ్ఐఆర్‌లు...

గతంలో విషింగ్, ఫిషింగ్ వంటి చర్యలకు పాల్పడే సైబర్ నేరగాళ్లు ఆ తర్వాత ప్రజల్లో అవగాహన పెరగడంతో పంథా మార్చి కొన్నేళ్ల కాలంగా ట్రేడింగ్ పేరుతో, టాస్కుల పేరుతో పెద్ద మొత్తంలో దోచుకున్నారు. వాటికి సైతం సైబర్ సెల్ పోలీసులు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. ఇల్లెందులో ఐదుగురు మహిళల పేరుతో దొంగ బ్యాంకు అకౌంట్లు తెరిచిన సంఘటనను సైబర్ నేరాల కోసం వాడుతున్నట్టుగా తేల్చిన పోలీసులు... దాని ఆధారంగా సైబర్ నేరగాళ్లకు మూలబిందువైన అకౌంట్‌ను తెరిచేందుకు సహకరించే వారిపై దృష్టి సారించడంతో కొంతమేర వాటికి తెరపడింది. దాంతో ఈ సారి సైబర్ నేరగాళ్లు ఏకంగా డిపార్ట్‌మెంట్‌నే వేదికగా మార్చుకుని నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్లు బాధితులకు ఫోన్లు చేసిన సందర్భంలో ఎవరైనా అనుమానం వ్యక్తం చేస్తే.. బాధితులకు ఏకంగా తాము నిజమైన పోలీసులమంటూ నకిలీ ఐడీ కార్డులు పంపుతారు. అది నమ్మి తమపైన కేసు నమోదయిందనీ గ్యారంటీ అడిగితే ఎఫ్ఐఆర్ కాపీని కూడా పంపుతారు. అది కూడా నకిలీదే. వీడియోకాల్ మాట్లాడి మరీ నమ్మకం కుదిరేలా వ్యవహరిస్తారు. అచ్చం పోలీసుల మాదిరి విచారణ నిర్వహిస్తారు.



సైబర్ నేరగాళ్ల నకిలీ ఐడీ కార్డు, నకిలీ ఎఫ్ఐఆర్

పోయేది కోట్లలో.. రికవరీ లక్షల్లో..

సాధారణ దొంగతనాలతో సరిసమానంగా సైబర్ నేరగాళ్లు డబ్బులు కొట్టేస్తున్నారు. జిల్లాలో 2022లో 338 దొంగతనాల కేసులు నమోదు కాగా, రూ. 4.96 కోట్లు, 2023లో 241 కేసులకుగాను రూ. 4.48 కోట్లు, ఈ యేడాది ఆగస్టు వరకు 405 కేసులు నమోదు కాగా రూ. 3.08 కోట్ల నష్టం జరిగింది. కాగా సైబర్ సెల్‌లో 2022లో 1249 కేసులు నమోదుకాగా రూ. 4.51 కోట్లు నష్టం జరిగింది. 2023లో 1332 కేసులు నమోదు కాగా రూ. 9.07 కోట్లు, ఈ యేడాది ఆగస్టు వరకు 292 కేసులు నమోదుకాగా రూ. 1.41 కోట్లు నగదును సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన నగదు రూ. కోట్లలో ఉంటుండగా, రికవరీ మాత్రం రూ. లక్షల్లో మాత్రమే ఉంటోంది. ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నందునే రికవరీ చేయలేకపోవడానికి కారణంగా కనిపిస్తుండగా.. పోలీసులు హోల్డ్‌లో ఉంచిన నగదును తిరిగి బాధితులకు చేరడానికి సైతం కొంతమేర ఆలస్యమవుతున్నట్టుగా బాధితులు చెబుతున్నారు.



ఖమ్మంలో సాయిబాబా సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ గోపీనాథ్

ప్రశ్నిస్తే కక్ష సాధింపులు...

- సాయిబాబా పట్ల అమానుషంగా ప్రవర్తించిన పాలకులు
- అభ్యుదయ శక్తులన్నీ ఒక్కతాటిపైకి రావాలి
- సంస్మరణ సభలో ప్రముఖ వైద్యుడు ఎం.ఎఫ్. గోపీనాథ్

6



కొత్తగూడెంలో బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

భద్రాద్రి జిల్లా నుంచే సమరశంఖం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం
- స్థానిక సంస్థలను ఉద్యమపార్టీ గెలుచుకోవడం ఖాయం
- మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్ , వనమా వెంకటేశ్వరరావు

6

నాయకులకు న్యూడ్ వీడియో కాల్స్

తల్లాడ మండలంలో కలకలం

తల్లాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొందరు రాజకీయ నాయకులకు న్యూడ్ వీడియో కాల్స్ రావడం కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వరుసగా కొందరు రాజకీయ నాయకులకు వీడియోకాల్స్ వచ్చాయి. గుర్తుతెలియని మొబైల్ నెంబర్ నుంచి తమకు వీడియోకాల్స్ రావడంతో సదరు రాజకీయ నాయకులు కాల్ లిఫ్ట్ చేయగా స్క్రీన్‌పై మహిళ నగ్నంగా కన్పించింది. దీంతో ఖంగుతిన్న రాజకీయ నాయకులు తేరుకొని కాల్ కట్ చేశారు. తమను బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశంతో ఎవరైనా ఈ పనికి పాల్పడి ఉంటారని రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు. న్యూడ్ వీడియోకాల్ నెంబర్ 91758025783 ద్వారా వచ్చిందని, మొబైల్‌నెంబర్ ఎవరిదని తెలుసుకొనేందుకు సెర్చ్ చేసినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఐడియా-హిమాలాచల్ ప్రదేశ్ అనే సమాచారం మాత్రమే వచ్చిందని వారు తెలిపారు.

అర్హులకే సంక్షేమ పథకాలు అందాలి

- ఎమ్మెల్యేలతో చర్చించి సమస్యలను గుర్తించాలి
- భద్రాద్రి దిశ సమావేశంలో ఎంపీలు పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాం రెడ్డి

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, ఆదివాసీ గిరిజన కుటుంబాలకు అందేలా అధికారులు కృషి చేయాలని ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్ తెలిపారు. అధికారులు బాధ్యతగా పనిచేసి పేదల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కొత్తగూడెం ఐడీఓసీ సమావేశ మందిరంలో శనివారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం అధ్యక్షతన జరిగిన దిశ కమిటీ సమావేశంలో ఎంపీలు మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, అంగన్‌వాడీ సెంటర్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్, ఐటీడీఏ పీఓలు విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు నియోజకవర్గాల వారీగా వినియోగించేందుకు ఏమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గుర్తించిన సమస్యలను పరిష్కరించాలన్నారు.



కొత్తగూడెంలో 'దిశ' సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

కొత్తగూడెం దిశ కమిటీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలపై గళం విప్పారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ మాట్లాడుతూ గత దిశ సమావేశంలో కొత్తగూడెం త్రీటౌన్ నుంచి కారుకొండ వెళ్లే రహదారి డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు చేసి ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించాలని ప్రతిపాదిస్తే నేటివరకు స్పందన లేదన్నారు.

ప్రతిస్పందిస్తున్న హృదయాలు

- పేద విద్యార్థుల కోసం సేవా ఎడ్యుకేషన్ సొసైటీ
- 17 యేళ్లుగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు
- ఇప్పటి వరకు 800 మంది విద్యార్థులు చేయూత
- తోడైన కృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్టు
- ఈ ఏడాది మరో 150 మందికి స్కాలర్‌షిప్‌లు

వారు నిరు పేదకుటుంబం లోంచి వచ్చారు. ఎన్నో కష్ట నష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థానంలో ఉన్నారు. పేద విద్యార్థులకు సాయం చేయాలని తలంచారు. 11 మంది కమిటీగా ఏర్పడి ప్రతిస్పందన సేవా ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేశారు. దాతల నుంచి నగదు సేకరించి పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. గత 17 సంవత్సరాలుగా సుమారు 800 మంది విద్యార్థులకు చేయూత అందించారు. గత ఏడాది నుంచి వీరు చేస్తున్న సేవలను చూసి కృష్ణ దేవరాయ చారిటబుల్ (పేద బలహీన వర్గాల సహాయ నిధి) ట్రస్టు అధినేత తులసీ రామ చంద్ర ప్రభు తనవంతు సాయం అందిస్తున్నారు. తన దాతృత్వాన్ని చాటుతూ నిరు పేద విద్యార్థులకు సాయం చేస్తున్నారు. నేడు ప్రతిస్పందన సేవా ఎడ్యుకేషన్ సొసైటీ 17 వార్షికోత్సవం సందర్భంగా కృష్ణ దేవరాయ ట్రస్టులు ఆధ్వర్యంలో మరో 150 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నారు. పేద విద్యార్థులకు వీరు చేస్తున్న సాయాన్ని చూసి విద్యార్థులతో పాటు ప్రతీ ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభినందన



గత ఏడాది విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న తులసీ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ రామచంద్ర ప్రభు

చర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదువుకునేందుకు అనేక మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. కనీసం పుస్తకాలు కొనలేని నిరుపేదలు చర్ల మండలంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అలాంటి వారికి సాయం చేసేందుకు చర్లకు చెందిన చింతా నాగ బాబు, షేక్ సాజహాన్, ఎడారి భూపతిరావు, నీలి ప్రసాద్, జవ్వాది రవి, దొడ్డి తాతారావు, అగ్బర్ షా, శేషెట్టి సాంబయ్య, చిట్టిబోతుల వేణు, పున్నం రామకృష్ణ, పెందుర్తి ఆంజనేయులు, బత్తుల శ్రీనివాస్, సాంబమూర్తి 2007 సంవత్సరంలో ప్రతి స్పందన సేవా ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దాతల దగ్గర నుంచి నగదు సేకరించి విద్యార్థులకు సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 800 మంది విద్యార్థులకు సాయం చేశారు. స్థానికంగా చదువుకునేవారికి రూ.3 వేలు దూర ప్రాంతంలో ఉండి చదువు కునేవారికి (అర్హతబట్టి) రూ. 10 వేల నగదు అందిస్తున్నారు.

ప్రతి స్పందనకు తోడైన కృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్టు

పేద విద్యార్థులకు ప్రతి స్పందన సభ్యులు చేస్తున్న సహాయాన్ని చూసి కృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తులసీ రామచంద్ర ప్రభు తనవంతు సహాయాన్ని అందిస్తున్నారు. ప్రతిస్పందన తో కలిసి గత ఏడాది నుంచి అనేక మంది విద్యార్థులకు నగదు అందజేస్తున్నారు. ప్రతి స్పందన సభ్యులు ఎంత ఉపకార వేతనాలు అందిస్తే నేను అంత నగదును తనవంతుగా సాయం అందిస్తానని చెప్పడం, గత ఏడాది సాయం చెయ్యడం ఆయన సహృదయానికి నిదర్శనం. అలాగే ఈ ఏడాది కూడా తనవంతు సాయం చేస్తున్నారు. దీంతో చర్ల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన తన ట్రస్టు ద్వారా గుంటూరు, ఇతర ప్రాంతాల్లోని అనేక పేద విద్యార్థులకు సాయం చేస్తూ అందిరి హృదయాలను ఆయన గెల్చుకుంటున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

వచ్చే నెలలో ఉపకార వేతనాలను ప్రతి స్పందన సొసైటీ సభ్యులు అందించబోతున్నారు. ఇందు కోసం కొన్ని నెలల ముందు నుంచే విద్యార్థులనుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు అందజేయవచ్చు. వాటిని పరిశీలించి స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. వాస్తవానికి గత నెలలోనే గడువు పూర్తయినప్పటికీ విద్యార్థుల కోరిక మేరకు పొడిగించారు.

సేవలు అభినందనీయం

చర్ల కు చెందిన ప్రతి స్పందన సభ్యులను చర్ల వాసులు అభినందిస్తున్నారు. వారు నిరుపేదలకు సాయం చేయడం చాలా గొప్పవిషయమని ప్రతీ ఒక్కరూ కొని యాడుతున్నారు. ప్రతీ ఇక్కరూ ఇలానే ముందకు వచ్చి సాయం చేయాలని కోరుతున్నారు. గుంటూరుకు చెందిన తులసీ రామచంద్ర ప్రభు చర్ల చేస్తున్న అభినందనీయమని ప్రతీ ఒక్కరూ ప్రశంశలు గుప్పిస్తున్నారు. ఈ ఏడాది మరో 150 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నారు.

అర్హత గల ఉపాధ్యాయులందరు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావా రవి

కొణిజర్ల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు అర్హత గల ఉపాధ్యాయులందరు ఓటు నమోదు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావా రవి కోరారు. శనివారం మండలంలోని తనికెళ్లలో గల మైనార్టీ, జ్యోతిబాయిఫూలే గురుకుల పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు జీరోవన్, జీరోహెడ్ ద్వారా జీతాలు చెల్లించాలని, హెల్త్‌కార్డులు వెంటనే జారీ చేయాలని, కేర్‌టేకర్ డిప్యూటీ వార్డెలను నియమించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకైన ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని యుటీఎఫ్ బలపరుస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులందరు ఓటును నమోదు చేసుకోని మార్చిలో జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, మహేష్, లివింగ్‌స్టన్, మాదాల ప్రసాద్, చిలుకూరు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కూరగాయలు కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	54
పచ్చిమిర్చీ	44
కాకరకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	60
దోసకాయ	54-60
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	30
దొండ	28-38
సొరకాయ	30
క్యారెట్	58
క్యాప్సికం	80
అలుగడ్డ	40
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్లట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- డీఎస్వో, డీసీవో చందన్‌కుమార్, గంగాధర్



మాట్లాడుతున్న డీఎస్వో చందన్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, సహకార అధికారి గంగాధర్ కోరారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ 2024-25 ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులు, ప్యాడ్ క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని, ఈ సమాచారం ప్రత్యేక అధికారులకు తహసీల్దార్లకు అందజేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల దగ్గర పరిసరాలను శుభ్రం చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్, తాగునీరు, కుర్చీలు మొదలగు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వర్షాల దృష్ట్యా అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. సన్న రకాల ధాన్యం కొనుగోలు పై అదనంగా రూ. 500 ఇస్తున్న వివరాలను టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర, రైతులు తీసుకు రావాల్సిన డాక్యుమెంట్లపై వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. సన్న రకం ధాన్యం నాణ్యత వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ధృవీకరిస్తారని అన్నారు. ఏఈవో. టోకెన్ నెంబర్, ధాన్యం రకం వివరాలు, ధాన్యం పరిమాణం, నాణ్యత మొదలగు అంశాల సర్టిఫికెట్ ను పరిశీలించి కాంటా పెట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిజిస్ట్రార్లు ఎండీ ఆసీఫ్ అన్వర్, టి. వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ టెక్నికల్ అసిస్టెంట్ రాంచందర్, పీఏసీఎస్ సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా బహిరంగ సభను జయప్రదం చేయండి: ఐద్వా ఉపాధ్యక్షురాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలు సోమవారం కొత్తగూడెం పట్టణంలోని జరుగుతున్న మహిళా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని, మహిళలు అదిక సంఖ్యలో హాజరు కావాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ విజ్ఞప్తి చేశారు. శనివారం కొత్తగూడెం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సరళ పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం పాత బస్ డిపో ప్రాంతం నుండి మధ్యాహ్నం ప్రదర్శన ప్రారంభమవుతుందని,రెండు గంటలకు సూర్యప్యాలెస్ ఎదురుగా ఉన్న గౌండ్ నందు బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభలో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ నాయకురాలు, మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందాకారత్ ముఖ్య అతిధిగా హాజరవుతున్నారని తెలిపారు.మహిళలపై హింస, అత్యాచారాలు వేధింపులకు వ్యతిరేకంగా ఐద్వా ఆపోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను మధ్యయుగాలు నాటికి నడిపించాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, కొత్తగూడెం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఇందిరా, ఎస్.లక్ష్మీ పాల్గొన్నారు.

ఇల్లెందులో విలేకరిపై దాడి అమానుషం

- ఖండించిన పాత్రికేయులు
- ఎస్పీ రోహిత్‌రాజుకు వినతిపత్రం అందజేత



ఎస్పీ రోహిత్‌రాజుకు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఇల్లెందులో విలేకరిపై దాడి అమానుషమని, ఆ దాడిని ముక్తకంఠంతో పాత్రికేయ సంఘాలు, పాత్రికేయులు శనివారం ఖండించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఇల్లెందులో గురువారం రాత్రి ఓ పత్రికా విలేకరి నట్టా సుదర్శన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని మండిపడ్డారు. సుదర్శన్‌పై దాడిని నిరసిస్తూ దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని , ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే నింధితులను అరెస్ట్ చేశారని, అందుకు ఎస్పీ చొరవ తీసుకున్నందుకు పాత్రికేయులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడారు. ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టి నింధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పాత్రికేయులకు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు విధి నిర్వాహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఎవరైనా దాడి చేసే అవకాశాలు ఉన్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని పాత్రికేయులకు సూచించారు.

ప్రశ్నిస్తే కక్ష సాధింపులు..

సాయిబాబా పట్ల అమానుషంగా ప్రవర్తించిన పాలకులు

అభ్యుదయ శక్తులన్నీ ఒక్కతాటిపైకి రావాలి

సంస్మరణ సభలో ప్రముఖ వైద్యుడు ఎం.ఎఫ్. గోపినాథ్



రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు అభ్యుదయ శక్తులన్నీ ఒక్కతాటిపైకి రావాలని ప్రముఖ వైద్యుడు ఎం.ఎఫ్. గోపినాథ్ పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ ప్రత్యామ్నాయ పౌర సమూహం (సీసీఏ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది.

ఈ సందర్భంగా స్వర్ణ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో గోపినాథ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రశ్నించే శక్తులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ప్రశ్నించే హక్కును కాలరాస్తూ వారిపై కక్షసాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సాయిబాబాను పదేళ్లపాటు నిర్బంధించటంతోపాటు అత్యంత ఘోరంగా శిక్షలకు గురిచేయటం ఇందుకు ఉదాహరణ అన్నారు. సాయిబాబా 90 శాతం వికలాంగుడైనప్పటికీ కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించారన్నారు. వైకల్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, అతని మెదడు మంచిగానే పనిచేస్తోందనడం అత్యంత దుర్మార్గం అన్నారు. పాలకుల విధానాలను, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగట్టినందుకు గాను కక్ష పెంచుకొని సాయిబాబా పట్ల పాశవికంగా ప్రవర్తించారన్నారు.

తాను వైద్యుడిని అయినందున సాయిబాబా ఆరోగ్య స్థితికి ప్రత్యక్ష సాక్షినని చెప్పారు. సాయిబాబాకు హృద్రోగ సమస్య ఉన్నప్పటికీ ఆయనకు ఎటువంటి అనారోగ్యం లేదని నమ్మించే విధంగా ప్రవర్తించారన్నారు. ముంబై హైకోర్టు ఆదేశంతో తాను సాయిబాబా ఆరోగ్య స్థితిని వివరించేందుకు హాజరైనప్పటికీ పోలీసులు అనేక అవాంతరాలు కలిగించారన్నారు. గతంలో సత్యంబాబు విషయంలో సైతం ప్రభుత్వం ఇదే విధంగా కఠినంగా ప్రవర్తించిందని గుర్తు చేశారు. మానవ హక్కుల కోసం శ్రమిస్తున్న వాళ్లకు అండగా నిలిచేందుకు, ప్రశ్నించే వాళ్లకు తోడుగా ఉండేందుకు కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు, మేధావులు, రచయతలు తదితర ప్రజాస్వామికవాదులంతా ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యంగా పోరాడటం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోగలమన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, సీపీఐ జిల్లా నేత జుమ్ముల జితేందర్ రెడ్డి, మాస్‌లైన్ రాష్ట్ర నేత ఆవుల వెంకటేశ్వర్లు, ఎంఎల్ పార్టీ రాష్ట్ర నేత ఆవునూరి మధు, సీసీఏ నాయకులు ఐవీ రమణారావు, రవి మారుత్, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, డాక్టర్ భారవి, పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పార్లమెంట్ ఎన్నికలకు తీసుకున్న

వాహనాలకు అద్దె చెల్లించలేదు

భద్రాద్రి బీఆర్‌ఎస్ కార్యాలయం ఎదుట యజమానుల నిరసన



నిరసన తెలుపుతున్న వాహన యజమానులు

చుంచుపల్లి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమయంలో ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి ప్రచారం కోసం తీసుకున్న వాహనాలకు అద్దె చెల్లించలేదని ఆయా వాహనాల యజమానులు శనివారం భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. శనివారం బీఆర్‌ఎస్ సమీక్ష సమావేశం నిర్వహించగా పార్టీ శ్రేణులను ప్రధాన ద్వారం వద్ద లోనికి వెళ్లకుండా అడ్డుకొని నిరసన తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు పెట్టిన వాహనాల అద్దె డబ్బులకోసం గత ఎనిమిది నెలలుగా తిరిగినా ఫలితం లేదని మండిపడ్డారు. సుమారు 12 వాహనాలకు కలిపి రూ.లక్షకు పైగా అద్దె సొమ్ము బకాయి ఉందని, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆయా వాహనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న వాహన యజమానుల వద్దకు వెళ్లిన భద్రాద్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ వారికి ఇవ్వాల్సిన అద్దె డబ్బులు తప్పకుండా చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చారు. దాంతో వారు ఆందోళన విరమించారు.

ఎస్‌జీఎఫ్ అండర్-14 టీటీ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14 బాల, బాలికల టేబుల్ టెన్నిస్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపి క్రీడాకారుల వివరాలను ప్రకటించారు. జట్టులో సోహైల్, చార్విక్, హితేష్, తరుణ్, హరి, సోమశేఖర్, అనాస్, సాయిశివాని, జవేరియా, ఉజ్వల, అక్షయ, హర్షిత, షైని, రోజాషా ఎంపికైనట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నర్సింహమూర్తి, కొత్తగూడెం జిల్లా ఎజీఎఫ్ సెక్రెటరీ నరేష్‌కుమార్, సమీక్షించారు.

భద్రాద్రి జిల్లా నుంచే సమరశంఖం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం మాజీ మంత్రులు పువ్వాడ, వనమా



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

చుంచుపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుదామని, ప్రజలకు తెలియజేసేలా ఐక్యంగా పోరాడుదామని మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌లో శనివారం జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ రేగాకాంతారావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్యమైన ఈ భద్రాద్రి గడ్డ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై దంచుడు ప్రారంభం అవ్వాలని కోరారు. గత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతికూల ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ పంచాయతీలు, స్థానిక సంస్థలను ఉద్యమ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన కార్యకర్తలకు, పార్టీ నాయకత్వానికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. భద్రాద్రిలో ఉప ఎన్నికలు వస్తే మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

ఈ సమావేశంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహంతో జోష్ పెరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్ పర్సన్ సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, మాజీ బీఆర్ఎస్ శాసన సభ్యులు మెచ్చ నాగేశ్వరరావు, హరిప్రియనాయక్, తాటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రాకేష్‌రెడ్డి, దిండిగల రాజేందర్, కౌన్సిలర్లు వేణు, ప్రసాద్, మహిళ నాయకురాలు బాదావత్ శాంతి, అన్వర్ పాషా, ఆరీఫ్‌ఖాన్, రామాకాంత్, శ్రీధర్, సాగర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



కూసుమంచి/పాల్వంచ. అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పెరికశింగారం గ్రామం సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సానిక పోలీసులతో కలిసి పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లో వివిధ గ్రామాల్లో డీలర్లు, లబ్ధిదారులనుంచి సేకరించిన బియ్యాన్ని పెరికశింగారం సమీపంలో ఒక చోట డంప్ చేశారు. వాటిని ఏపీ16 టీఈ 1359 లారీతో పాటు, మరో ట్రాలీ వాహనాల్లో తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. ఈక్రమంలో పక్కా సమాచారం అందుకున్న ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వెంకటేష్, సీఐ తిరుపతిరావు, ఎస్ఐలు మహేష్, కిరణ్‌కుమార్, స్థానిక ఎస్ఐ నాగరాజుతో కలిసి శనివారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. ఈమేరకు కూసుమంచి పోలీసులకు, సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. వాహనాలను సీజ్ చేశారు.

ఎవరిపైనా కేసులు లేవు

ఇంతపెద్దఎత్తున 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినప్పటికీ ఎవరిపైనా పోలీసులు, సివిల్ సప్లై అధికారులు కేసునమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కోదాడకు చెందిన పెద్దవ్యాపారి హస్తం ఉందని తెలిసినప్పటికీ రాజకీయ అండదండలతో కేసులు నమోదుచేయకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కనుసన్నలతోనే అక్రమబియ్యం దందా జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐదు క్వింటాళ్ల రేషన్‌బియ్యం..

పాల్వంచ (ఆంధ్రజ్యోతి) అక్రమంగాగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఉల్వనూరు నుంచి పాల్వంచ పట్టణ వైపు ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పాల్వంచ మండల పరిధిలోని రాజాపురం క్రాస్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాములు, సిబ్బంది ఆటోను నిలిపారు. తనిఖీ చేయగా ఆటోలో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండటంతో ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం తరలిస్తున్న అప్పుల శ్రీనివాస్, ఆటో డ్రైవర్ నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

క్రైం సమాచారం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల ఆత్మహత్య

ఖమ్మంక్రైం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. టుటౌన్ పోలీసుల కథనం ప్రకారం పెనుబల్లి మండలం మొండికుంట గ్రామానికి చెందిన మద్దినేని సరస్వతి (35)కి తన భర్త నరేష్‌తో గతంలో గొడవలు రావడంతో 3 ఏళ్లనుంచి వేరుగా ఉంటుంది. కొంతకాలంగా ఖమ్మంలోని ఉపేంద్రయ్యనగర్‌లో నివాసం ఉంటూ బ్యూటీషియన్‌గా పనిచేస్తుంది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉండగా 13 ఏళ్ల కుమారుడిని తన తండ్రి వద్ద ఉంచుతూ ఆరేళ్ల కూతురును తన వద్ద ఉంచుకుంటుంది. కాగా శనివారం ఉదయం తాను నివాసం ఉంటున్న ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది. తెల్లారిన తర్వాత తన కుమార్తె నిద్రలేచి చూడగా అది చూసి భయపడింది. తర్వాత తన అమ్మ మ్మకు వీడియోకాల్ చేసి చూపించగా సమీపంలో ఉంటున్న బంధువులకు సమాచారం ఇచ్చి పరుగు పరుగున వారు చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా మృతురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఇంకా వివరాలు తెలియరాలేదని విచారణచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మనస్థాపంతో మహిళ..

భర్త మృతిచెందాడని బాధతో ఓ మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నంకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. టుటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం తల్లాడ మండలం వెంకటాపురానికి చెందిన సారికల కృష్ణవేణి (33) తన భర్తతో కలిసి నగరంలోని బ్యాంకు కాలనీలో ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కొద్ది నెలల క్రితం భర్త మృతిచెందడంతో ఆ అపార్టుమెంట్ లోనే పనిచేసుకుంటూ తన 15 ఏళ్ల కూతురుతో, 13 ఏళ్ల కొడుకుతో కలిసి ఉంటుంది. దీంతో భర్త లేడు అన్న బాధతో పిల్లల్ని ఎలా పోషించాలని ఆలోచనతో మనస్థాపంతో ఈనెల 17న తాను ఉంటున్న గదిలో ఎలుకల మందు తిని ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత వాంతులు చేసుకుంటుండగా తన కూతురు చూసి తల్లిని అడిగింది. ఎలుకలమందు తిన్నాని చెప్పడంతో వెంటనే కుటుంబసభ్యులు సహకారంతో ఆ సుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుటుంబసభ్యులు ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్టు టుటౌన్ పోలీసులు తెలిపారు.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బలవన్మరణం


ముకుంద (ఫైల్)

ఖమ్మం క్రైం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని పురుగుమందు తాగి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న లకావత్ ముకుంద (50) నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందాడు. ఎంతసేపటికి ఫోన్ చేస్తున్నప్పటికీ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బంధువుల ద్వారా ఇంటి వద్దకు రాగా మృతిచెంది ఉన్నాడు. దీంతఈ తో కుటుంబ సభ్యులు ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె భార్యా ఉన్నారు. ఈ సంఘటన సమయంలో మృతిని కుటుంబ సభ్యులు వేరే ఊరిలో ఉన్నారు. ఆతహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

సుజాతనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌వోఆర్ 7 వంతెన, మంగపేట వద్ద 17న ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని కారు ఢీ కొట్టిన ఘటనలో తీవ్ర గాయాలతో ఖమ్మంలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని మంగపేట గ్రామానికి చెందిన గుగులోత్ శంకర్ (63) శనివారం మృతి చెందాడు. మంగపేట గ్రామానికి చెందిన శంకర్ ఈ నెల 17న ద్విచక్ర వాహనంపై కూరగాయల వ్యాపారం ముగించుకుని సుజాతనగర్ నుంచి మంగపేటకు తిరిగి వస్తున్న క్రమంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగి వస్తున్న క్రమంలో వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టడంతో బైక్ వస్తున్న శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని బంధువుల సహాయంతో కొత్తగూడెంలోని ప్రభుత్వకి అక్కడినుంచి అత్యవసర వైద్యం నిమిత్తం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7.30 గంటలకు మరణించాడు. మృతుడి భార్య గుగులోత్ భద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

ఖమ్మం క్రైం, అక్టోబరు 19:(ఆంధ్రజ్యోతి) షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైన సంఘటన శనివారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. నగరానికి చెందిన నరేష్ అనే వ్యక్తి కోర్టు సమీపంలో తన కారును నిలిపి బయటకు వెళ్ళాడు. కొద్దిసేపటి తరువాత కారులో షార్ట్ సర్క్యూట్ అయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికు లు ఫైర్ సిబ్బందికి సమాచారం అందిం చడంతో వారు అక్కడికి చేరుకొని మంట లను అదుపుచేశారు. కాగా కారులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి ..


వెంకటేశ్వరరావు (ఫైల్)

వేంసూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపాలెం చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన పుచ్చా వెంకటేశ్వరరావు(34) శుక్రవారం చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. శనివారం తహసీల్దార్ ఎంఏ రాజు వైరా నుంచి గజఈతగాళ్లను తెప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. వేంసూరు పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాచలం, పాల్వంచలో గంజాయి పట్టివేత

భద్రాచలం/పాల్వంచ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి కర్ణాటకకు గంజాయిని తరలిస్తుండగా భద్రాచలం ఆర్టీసీ బస్టాండులో కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్‌కు చెందిన గణేష్ అయ్యన్‌పండగొండ అనే వ్యక్తిని భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 17.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ పీవీఎన్‌రావు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.42 లక్షలు ఉంటుందని అంచనా.

పాల్వంచలో గంజాయి..

అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పాల్వంచ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకుని నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు. కృష్ణా జిల్లాకు చెందిన బంకురు ధనుష్ కుమార్ జీలేరులో కేజీ గంజాయి కొనుగోలు చేసి గుడివాడకు బయలుదేరాడు. ఈ క్రమంలో పాల్వంచ బస్టాండ్‌లో బస్సు దిగి విజయవాడ వెళ్ళే బస్సు కోసం వేచి యున్నాడు. అదే సమయంలో బస్టాండ్ సెంటర్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అతని కదలికలపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా అతని చేతిలో ఉన్న సంచిలో కేజీ ఎండు గంజాయి బయట పడింది.

దీంతో అతనిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ధనుష్‌కుమార్‌పై గతంలోనూ పలు కేసులు కృష్ణా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో ఉన్నాయని పాల్వంచ టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తున్న ఓ రైలు నుంచి సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఖమ్మం రైల్వేస్టేషన్ దాటిన తర్వాత ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఇది గమనించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అం దించడంతో వారు సంఘటనాస్థలం వద్దకు చే రుకొని మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి ఫోటో విడుదల



ఖమ్మంక్రైం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి ఫొటోను శనివారం వన్‌టౌన్ పోలీసులు విడుదల చేశారు. ఫోటోల ఉన్న వ్యక్తి నగరంలో ఎక్కడైనా కనిపించినా 8712659106 నెంబరకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ ఓ ప్రకటన లో తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వి వరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

పినపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామ పంచాయతీలో పోతిరెడ్డిపల్లి సెంటర్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త గడ్డం సత్యవతి (55) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరైన ఆమె ఛాతిలో నొప్పిగా ఉందటూ కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన మణుగూరు ప్ర భుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కేఎంసీకి వీధి వ్యాపారుల క్యూ

- 2019 ప్రధానమంత్రి స్వనిధి రుణాలకు మోక్షం
- ఖమ్మం మెప్మా పరిధిలో 27,743 మంది వ్యాపారులకు రుణాలు


ఆన్‌లైన్ చేస్తున్న మెప్మా ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రేయులైన వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్వనిధి రుణాల పథకానికి 2019 నుంచి 2023 వరకు విరివిగా దరఖాస్తులను స్వీకరించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 21,751 మంది, మధిరలో 2,229 మంది, సత్తుపల్లిలో 2,134 మంది, వైరాలో 2,008 మంది వీధి వ్యాపారులు దరఖాస్తులు చేశారు. కరోనా తర్వాత పలు కారణాలతో వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం రుణాలను మంజూరు చేయలేదు.

ఇటీవల కాలంలో వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవాలని కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగటంతో ప్రధాన మంత్రి స్వనిధి కార్యక్రమానికి మోక్షం కలిగింది. దీంతో ఖమ్మం జిల్లా మెప్మా పరిధిలో దరఖాస్తులు స్వీకరించిన 28,122 మందిలో 27,743 మందికి వీధి వ్యాపార గుర్తింపు కార్డులను ఖమ్మం మెప్మా అధికారులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి స్వనిధి పథకంలో రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వడ్డీ లేని రుణాలను పొందే అవకాశం ఉంది. మొదటి సారి తీసుకున్న రూ.10వేలు చెల్లింపులు చేస్తే తిరిగి రూ.20వేలు రుణాలు అందుతాయి. ఆలా రూ.10వేల వరకు రుణాలను వీధి వ్యాపారులు పొందవచ్చు. ఖమ్మం మెప్మా పరిధిలో రూ.10వేలు మంజూరు జరిగిన వీధి వ్యాపారులు 21,531 మంది ఉన్నారు. రూ.20 వేలు మంజూరు జరిగిన వారు 13,134కు చేరారు. రూ.50వేలు రుణాలకు అర్హత పొందిన వారు 4,223 మంది ఉన్నారు. వీరికి సంబంధిత బ్యాంకుల నుంచి రుణాలను అందించేందుకు మెప్మా అధికారులు వీధి వ్యాపారుల రుణాల మంజూరును ఆన్‌లైన్ చేసి వ్యాపారులకు సహకారం అందిస్తున్నారు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ వీధి వ్యాపారులతో క్యూ కట్టి కనిపిస్తోంది.

డిజిటల్ చెల్లింపుల ద్వారా క్యాష్‌బ్యాక్

సుజాత, టీఎంసీ, ఖమ్మం

ప్రధానమంత్రి స్వనిధి రుణాలను వీధి వ్యాపారులు డిజిటల్ చెల్లింపులు ద్వారా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రుణాలను చెల్లించిన ప్రతి సారి వారికి ఖచ్చితంగా రూ.50 నుంచి రూ.500 వరకు క్యాష్‌బ్యాక్ వస్తోంది. రుణాల పరిమితి పెరుగుతోంది.

అన్ని వర్గాల అవసరాలు గుర్తిస్తున్న ప్రభుత్వం

- కల్లుగీత కార్మికులకు రక్షణ కిట్ల అందజేత
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి


కాటమయ్య కిట్లను అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే


వైద్య విద్యార్థులతో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని, ఇది అన్ని వర్గాల అవసరాలను గుర్తిస్తున్న ప్రజా ప్రభుత్వం అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఉచితంగా అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం కిట్లను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 100మందికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి పంపిణీ చేశారు. పనిప్రదేశంలో కల్లుగీత కార్మికుల అవసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కల్లుగీత కార్మికులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కిట్లను అందుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాగమయి అభినందనలు తెలిపారు. ఎప్పుడూ లేనివిధంగా ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో అర్హులైన వారందరికీ ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని 5మండలాలకు చెందిన 216మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.61,26,000 విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం ఎంబీబీఎస్‌లో సీట్ సాధించిన నియోజకవర్గానికి చెందిన 21మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని కిష్టారం ఎస్సీ కాలనీకి చెందిన 12మందికి కిష్టారం ఓసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులు కింద మంజూరైన టార్పాలిన్ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి, కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ నాయకుల డిమాండ్

ఎంఈఓకు వినతిపత్రం అందజేత

పాల్వంచ, అక్టోబరు 19: పాల్వంచ పట్టణ పరిధిలోని ఓ మతానికి చెందిన పాఠశాలలో హిందూ మతానికి చెందిన విద్యార్థులపై స్కూల్ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని, తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ ఎంఈఓ శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందించి స్కూల్‌లో విద్యార్థులు అనుభవిస్తున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. హిందూ మతానికి చెందిన విద్యార్థులు తమ సాంప్రదాయాలను పాటిస్తున్న క్రమంలో ప్రిన్సిపాల్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అదే విధంగా బలవంతంగా క్రైస్తవ మతానికి చెందిన ప్రార్థనలు చేయిస్తూ మత మార్పిడికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి మాధారపు లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి ధారావత్ నరేష్, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి మాలోత్ ప్రశాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు దాసరి రమేష్, నవీన్‌రెడ్డి, శ్రీధర్, పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ముత్యాల కవచ అలంకారంలో శనివారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యం లో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదాన సత్రంలో సేవా సమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా ఉచితంగా అన్నవితరణ చేశారు. అన్నదాన సత్రంలో హైదరాబాదుకు చెందిన కంఠమనేని అర్యన్ జన్మదినం సందర్భంగా సేవాసమితి నిర్వాహకులు అన్న గోవిందంలో భాగంగా భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, సుదర్శనశర్మ, అన్నదాన సేవాసమితి నిర్వాహకులు ఎల్‌వీ నారాయణరెడ్డి, బొబ్బాకిరణ్, వి.వెంకట కృష్ణారావు, లీలాకృష్ణ, వేదపండితులు , అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీపురం రైల్వేస్టేషన్ తరలింపు వాయిదా

కారేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీపురం రైల్వేస్టేషన్‌ను ఇటివల కిలోమీటర్ దూరంలో నూతనంగా నిర్మాణం పూర్తిచేసుకున్న చర్లపల్లి రైల్వేస్టేషన్‌లోకి మార్చాలని అధికారులు ప్రయత్నంచేశారు. గాంధీపురంలోనే రైల్వేస్టేషన్‌ను కొనసాగేలా చూడాలని కోరుతూ మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వేముల రాంమూర్తి పలుమార్లు రైల్వే అధికార్లను కలిసి విజ్ఞప్తిచేశారు. గాంధీపురం రైల్వేస్టేషన్‌నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే సరైన రహదారి లేదని అందుకే స్టేషన్‌ను మార్చవద్దని రాంమూర్తి చేసిన వినతికి అంగీకరించిన రైల్వే అధికారులు ప్రస్తుతం రైల్వేస్టేషన్‌ను మార్చును వాయిదా వేసినట్లు రామూర్తి శనివారం విలేకరులకు తెలిపారు.

ఇన్సూరెన్స్‌ను చెల్లించండి

ఖమ్మం లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కిషోర్ కన్‌స్ట్రక్షన్ ప్రొప్రైటర్ కిషోర్‌కు చెందిన టిప్పర్‌కు జరిగిన ప్రమాదంలో వాహనానికి జరిగిన నష్టానికి చోళ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు ఫిర్యాదికి ఇన్సూరెన్స్ క్రింద రూ.1.37లక్షల పాటు నష్టపరిహారం కింద రూ.10వేలు, ఖర్చుల క్రింద రూ.10వేలను చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పు చెప్పారు. కేసు వివరాలు కిషోర్ కన్‌స్ట్రక్షన్ ప్రొప్రైటర్ వి.కిషోర్ పాల్వంచలో నవ లిమిటెడ్ కంపెనీలో తనకు గల టిప్పర్‌ను ట్రాన్స్‌పోర్టు కొరకు ఉపయోగించినాడు. తన టిప్పర్‌కు 16-11-2022లో చోళ ఇన్సూరెన్స్‌ను తీసుకున్నాడు. తర్వాత ఆ టిప్పర్ 27-9-2023న ప్రమాదానికి గురైంది. ఆ విషయాన్ని చోళ ఇన్సూరెన్స్‌కు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోక పోవడంతో ఫిర్యాది తన న్యాయవాది ముప్పా నాగేశ్వరరావు ద్వారా ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. కేసును పరిశీలించిన ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పునిచ్చారు.

సాంకేతికతను వినియోగించి లక్ష్యాలు సాధించాలి


ప్రతినిధులతో చర్చిస్తున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో సాంకేతికతను వినియోగించుకుని లక్ష్యాలను సాధిస్తున్నామని జి. వెంకటేశ్వరరెడ్డి డైరెక్టర్ (పీఅండ్‌పీ), పా అన్నారు. శనివారం కొత్తగూడెంలో సింగరేణి ప్రధాన కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆస్ట్రేలియా దేశ న్యూ సౌత్‌వేల్స్ రాష్ట మైనింగ్ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లో అడుగుపెట్టిందని అన్నారు. ఇతర రంగాల్లో అవకాశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఏ. మనోహర్ జీఎం(సీపీపీ) పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి చరిత్ర, సాంకేతికతో సాధించిన ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, వృద్ధి రేటును వివరించారు. ఆస్ట్రేలియా బృంద సభ్యులు తమ కంపెనీలో రక్షణ, మైనింగ్ సాంకేతిక టెక్నాలజీ, యంత్రాలు, బొగ్గు ఉత్పత్తిని గురించి వివరించారు. సమావేశంలో జీఎంలు సూర్యనారాయణ, సాయిబాబు, రఘురామిరెడ్డి, రామ్‌కుమార్ రావు, ఆస్ట్రేలియా బృంద సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పిడుగు పాటుతో ఉలిక్కిపడ్డ జనం

- కల్లూరు, తిరుమలాయపాలెం మండలాల్లో పిడుగుపాటు బచ్చోడు తండాలో ముగ్గురికి అస్వస్థత


పిడుగుపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

కల్లూరు/తిరుమలాయపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామంలో శనివారం ఉరుములతో పిడగు పడటంతో ప్రజలు ఉలికిపాటుకు గురియైనారు. గ్రామ మధ్యన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం దగ్గర సామినేని పుల్లయ్య నివాసం ఎదురుగా గల నేరుడు చెట్టుపై పిడిగు పడింది. ఈ శబ్దానికి ప్రజలంత భయాభ్రంతులకు గురియైనారు. ఆరుబయట ప్రదేశాల్లో ఉన్న మరి కొంతమంది పిడుగు పాటు శబ్దానికి ఇళ్లలోకి పరుగులు తీశారు. నేరేడు చెట్టుపై పిడుగు పడగా కొమ్మలు మాడి నెల మీద పడటం సమీపాన భూమి కంపించి దుమ్మలేసింది. పిడుగు పడిన ప్రదేశానికి ప్రజలు కొంత దూరంలో ఉండటంతో ఆ సమయంలో ప్రమాదం తృటిలో తప్పింది. పిడుగుపాటుతో ఎలక్ట్రానిక్ పరికరాలు (సీలింగ్ ఫ్యాన్లు, ఫ్రీజ్‌లు) విద్యుత్ మీటర్లు దగ్ధమైనాయని తెలిసింది.

పిడుగు శబ్దంతో ముగ్గురికి అస్వస్థత

తిరుమలాయపాలెం, (ఆంధ్రజ్యోతి): మండ లంలోని బచ్చోడుతండా లో శనివారం సాయం త్రం ఒక్కసారిగా గాలిఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో బచ్చోడుతండాకు చెందిన భూక్యా శారద, దేవి, దరావత్ జీజా తమ పత్తిచేనులో పనులు చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో కూడిన ఉరుములు మెరుపుల వచ్చాయి దీంతో గ్రామ సమీపంలోని పిడుగుప డింది. దీంతో ఆశబ్దానికి వీరు అస్వస్థతకు గురయ్యారు. కాగా వారిని 108 ద్వారా ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

రేపు ప్రభుత్వ ఐటీఐలో అప్రంటీస్ మేళా

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో జాతీయ అప్రంటీస్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేళాలో హైదరాబాదు ఎస్ఎంసీ కంపెనీలు, ఖమ్మంజిల్లా లోకల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదుచేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు అప్రంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్‌కాపీ, పది, ఐటీఐ మెమోలు, కులధృవీకరణ పత్రం, రెండు పాస్‌ఫోర్టు ఫోటోలు తీసుకుని ఐటీఐలో హాజరు కావాలని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనల మేరకు అనుమతులు జారీ

- కేఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో లేఅవుట్ కమిటీ సమావేశం
- ఆరు లేఆవుట్స్‌కు అనుమతి

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు మాత్రమే లేఆవుట్స్ అనుమతులు జారీ చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్‌ఆగస్త్య సూచించారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో జిల్లా లేఆవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం 18లేఆవుట్స్ అనుమతుల కోసం సమావేశంలో ఫైల్స్ పెట్టగా అన్ని అనుమతులు ఉన్న ఆరు లేఆవుట్స్‌కు మాత్రమే అనుమతులు జారీ చేశారు. ఈ సమావేశంలో భూపరిపాలన, ఇరిగేషన్,రహదారులుభవనాలు,విద్యుత్, సర్వే ల్యాండ్ రికార్డు, డీటీసీపీవో,పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఇరుకు వీధులు.. ఆపై ఆక్రమణలు

- ప్రణాళిక లేని డ్రెయినేజీ, చిన్నపాటి వర్షాలకే వీధులు జలమయం
- రహదారుల విస్తరణకు ప్రణాళికలు వేసినా, ఆచరణ శూన్యం
- ప్రధాన రహదారిలోనూ అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి
- ఇదీ 25వ డివిజన్ దుస్థితి...

డివిజన్ విజిట్



డివిజన్‌లో ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారి



ధ్వంసమైన పురాతన డ్రెయినేజీలు



రహదారులను ఆక్రమించి నిర్మించిన మెట్లు

ఖమ్మంటౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఇరుకుదారులు.. అస్తవ్యస్త డ్రెయినేజీ కారణంగా నగరంలోని 25వ డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో పురాతన ప్రాంతం కావటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి డివిజన్‌లోని పలుప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ప్రణాళిక లేకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఉండటమే కాకుండా, పురాతన డ్రెయినేజీలు మురుగును పారించలేక పోతున్నాయి. రహదారుల విస్తరణకు ప్రణాళికలు వేసినా, ఆచరణ మాత్రం శూన్యం. డివిజన్‌లోని పలు రహదారుల్లో ఆటోవంటి వాహనాలు ఎదురెదురుగా వస్తే చాలా ఇబ్బంది కలుగుతోంది. పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రుల భయపడే పరిస్థితి.

డివిజన్ సమస్యలివీ..

డివిజన్‌లో రిక్కాబజార్ నుంచి చర్చికాంపౌండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా ఉంది. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పించటం కష్టం. అంబులెన్స్ వెళ్లాలన్నా ఎంతో ఇబ్బంది కలుగుతోంది. దీనివల్ల గతంలో పలువురు రోగులకు సకాలంలో వైద్యం అందలేదు. ప్రస్తుతం సుమారు 12అడుగుల వెడల్పు ఉన్న సదరు రహదారిని 33అడుగులకు విస్తరణ చేయాలని ప్రతిపాదనలు తయారు చేసి, తరువాత పట్టించుకోలేదు. ఇరుకు వీధుల్లోనే నివాసాల వారు రహదారిని ఆక్రమించి మెట్లు నిర్మించటంతో రహదారులు మరింత ఇరుకుగా మారాయి. ఇక డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షం వస్తే మురుగునీరు రహదారుల పైకి ఐదు అడుగుల నీరు చేరుతోంది. గతంలో మసీదు పక్కనుంచి డ్రెయినేజీ గుండా నేరుగా ప్రధాన డ్రెయినేజీకి మురుగునీరు పంపేవారు. తరువాత దానిని మూడు వంకలు తిప్పటంతో మురుగునీరు వర్షం నీటితో కలిసి అద్దంకివారి వీధి తదితర ప్రాంతాలు జలమయం అవుతున్నాయి.

డివిజన్‌లో జరిగిన అభివృద్ధి ఇదీ..

డివిజన్‌లో అభివృద్ధిపనుల కోసం అరకొర నిధులే కేటాయించారు. వచ్చిన నిధులతోనే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. డివిజన్‌లోని ఎస్సీకాలనీలో ప్రభుత్వం కేటాయించిన రూ.30లక్షలతో బస్తీదవాఖానా నిర్మించారు. ఇది పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నది. డివిజన్‌కు కేటాయించిన నిధులలో రూ.40లక్షలతో కమ్యూనిటీహాల్‌లో పైఅంతస్తును నిర్మించారు. రూ.10లక్షలతో గాంధీపార్కులో పిల్లలకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. రూ.20లక్షలతో మంచినీటి పైపులైన్లు, సీసీరహదారి నిర్మాణం, రహదారుల మరమ్మతులు చేపట్టారు.

డివిజన్‌లోని ప్రాంతాలు: రిక్కాబజార్ కూడలి. కుమ్మరిబజార్ సెంటర్, ఎస్సీకాలనీ, అద్దంకి వారి వీధి, సుతారివారి వీధి

డివిజన్ జనాభా: 8100 మంది, ఓటర్లు: 5200

వైశాల్యం: నాలుగు కిలోమీటర్లు

గాంధీపార్కులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి కృషి

25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ సహకారంతో గాంధీపార్కులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి కృషి చేస్తున్నాను. ఆటవస్తువులు ఏర్పాటుతో పిల్లలకు విద్యఆటలు ఉంటాయి. డివిజన్‌లో ఆస్తిపన్నులను సవరిస్తే అధిక ఆదాయం వస్తుంది. డివిజన్‌ను అభివృద్ధి చేయవచ్చు. ఈ విషయమై గత సమావేశాల్లో ప్రస్తావించా. అందుబాటులో ఉన్న ఆదాయంతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నా.

ఇరుకు వీధులతో భయం, భయం: ఎం. సరిత



ప్రధానరహదారి ఇరుకుగా ఉండటంతో ప్రయాణించాలంటేనే భయంగా ఉంటోంది. ఇక్కడే విద్యాలయాలు, గుడి ఉన్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితి వస్తే అంబులెన్స్‌లు కూడా రావటం లేదు. ఇరుకు వీధివల్ల ఇబ్బంది కలుగుతున్నది. పాఠశాలలకు వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చేవరకు ఆందోళనగా ఉంటుంది. గతంలో ప్రతిపాదించిన విధంగా రహదారిని 33అడుగులుగా విస్తరించాలి.

డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు: టీ.నరేందర్



డివిజన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. చిన్నపాటి వర్షం వచ్చినా, పలు ప్రాంతాలు జలమయమై మునిగి పోతున్నాయి. నడుంలోతు నీళ్లలో రోజుల తరబడి ఉండాల్సి ఉంటున్నది. డివిజన్‌లో పురాతనమైన డ్రెయినేజీలు ధ్వంసం అయ్యాయి. పక్కా డ్రెయినేజీలను నిర్మించి, సమస్యను పరిష్కరించాలి.

టీడీపీ మాజీ సర్పంచ్ లాలమ్మకు నివాళి

తిరుమలాయపాలెం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపాడు గ్రామ మాజీ టీడీపీ సర్పంచ్ లాలమ్మకు వివిధ పార్టీల నేతలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో వివిధ పార్టీల నాయకులు తమిర వెంకటరెడ్డి, మాజీసర్పంచ్ తమిర రాంమోహన్‌రెడ్డి, రామసహాయం వెంకటరెడ్డి, వేముల ఉపేందర్, మల్లారపు శ్రీధర్, జడల రమేష్, నివాళులర్పించారు.

వాహనదారులకు ఏసీపీ కౌన్సెలింగ్

ఖమ్మంక్రైం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నెంబరుప్లేట్లు, రిజిస్ట్రేషన్ లేకుండా తిరుగుతున్న 55ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంలోని పలు కూడళ్లలో ఇటీవల నిర్వమించిన స్పెషల్ డ్రైవ్‌లో ఈ వాహనాలు నెంబరుప్లేటు లేకుండా, రిజిస్ట్రేషన్ లేకుండా పట్టుబడ్డాయి. దీంతో వాహన యజమానులను స్టేషన్ వద్దకు పిలిపించి ఏసీపీ ఆధ్వర్యంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. దొంగలు సీసీ కెమెరాల నుంచి తప్పించు కునేందుకు హనాలకు నెంబరు ప్లేటు తొలిగిస్తున్నారని, దీనిలోభాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐలు రవి, సాగర్, రాము పాల్గొన్నారు.



వాహన యజమానితో మాట్లాడుతున్న ఏసీపీ

రూ.2లక్షల రుణమాఫీని వెంటనే చేయాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లిలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏటుకూరి రామారావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రూ.2లక్షల రుణం ఉన్న రైతులకు దాదాపుగా రూ.31వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ పూర్తిస్థాయి రుణమాఫీ గాకపోవటం పట్ల రైతాంగంలో ఆందోళన నెలకొందన్నారు. రైతుభరోసా చెల్లించకపోవటం, రుణమాఫీ గాకపోవటంతో పెట్టుబడులకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలేరు ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ ఈనెల 24న మూటాపురంలో జరుగనున్న మండల మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. సమావేశంలో గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీరాంరెడ్డి, పెద్దిరాజు నర్సయ్య, బలుసు ప్రమీల, పొన్నం శివరాజు, రాసాల కనకయ్య, యడ్ల తిరుపారావు, మండడపు మురళీకృష్ణ, పగిడి కత్తుల నాగేశ్వరరావు, రచ్చా నర్సింహారావు, గుగులోతు వీరూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుంతేటి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఉమ్మడిగా దళితుల హక్కుల సాధనకోసం పోరాడుదామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం పేర్కొన్నారు.శనివారం నగరంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామాలకు వెళ్లి మాలలను చైతన్యపరచాలని, సూచించారు. ఈ సమావేశంలో లింగాల రవికుమార్, పల్లా రాజశేఖర్, కొట్టె సుధాకర్, దామల్లసత్యనారాయణ, కనకరాజు, ఎం.బాబురావు పాల్గొన్నారు.

అటానమస్ విధి విధానాలపై అవగాహన

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి కళాశాలలుగా మారుతున్న సందర్భంగా శనివారం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ఆధ్వర్యంలో గవర్నెన్స్ ఆఫ్ అటానమి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విధి విధానాలను తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సత్తుపల్లి, పాల్వంచ, భద్రాచలం, ఖమ్మం కవిత మోమోరియల్, మహబాద్, మణుగూరు తదితర కళాశాలలకు స్వయంప్రతిపత్తి కలిపించడంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సిలబస్ కూర్పు, సెమిస్టర్ విధానం, పరీక్షల నిర్వాహణ తదితర అంశాలపై అవగాహన కలిపించారు. ఈకార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమాసత్యవతి, అధ్యాపకులు సర్వేశ్వరరావు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా కళాఉత్సవ్

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కళా ఉత్సవ్ 2024 పోటీలను శనివారం నగరంలోని పాతడీఈవో కార్యాలయంలో జిల్లా సైన్సుమ్యూజియంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను డీఈవోసోమశేఖరశర్మ, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ అభినందించారు. మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్సు, విజువల్ ఆర్ట్స్, థియేటర్‌ల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

స్కానింగ్ సేవలు పునరుద్ధరించాలి

- ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సీపీఎం నేతల వినతి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలను పునరుద్ధరించి రోగులకు మెరుగైన సేవలను అందించాలని సీపీఎం నాయకులు వై విక్రమ్ కోరారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో టిఫా.. టఫా అంటూ వచ్చిన కథనంపై స్పందించారు. టిఫా సేవలతో పాటు స్కానింగ్ సేవలను పునరుద్ధరించాలని వారు కోరారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్కానింగ్ మిషన్లు అధికారులు మూలన పడేయడంతో మహిళలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి టిఫా స్కానింగ్‌సేవలను అందించాలని కోరారు. గుండెకు సంబంధించిన ఆపరేషన్‌లకు పర్మనెంట్ డాక్టర్‌ను నియమించాలని వారు సూపరింటెండెంట్‌కు వివరించారు.

టీఎన్జీవో.. ఉద్యోగుల పక్షాన పోరాడుతోంది



టీఎన్జీవో ల్యాండ్‌సర్వే ఉద్యోగుల నూతన కమిటీ

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఉద్యోగులకు అండగా ఉంటుందని యూనియన్ జిల్లా నాయకులు కొణిదెన శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో ల్యాండ్‌సర్వే కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొణిదెన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, జమ్మి ఎస్ జయపాల్, మాజీ జిల్లా అధ్యక్షుడు పి రామయ్య, కొమరగిరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మురళీ మోహన్, సతీష్‌రెడ్డి, ఉపేందర్, కిరణ్‌కుమార్, ఉషారాణి, నాగేశ్వరరావు, శివ, ఆంజనేయులు, మధు మోహన్, భరత్, యాకుబీని అభినందించారు. ప్రతీ ఉద్యోగి అవసరాన్ని, సమస్యను తెలుసుకొని పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి గంగవరపు బాలకృష్ణ, సగ్గుర్తి ప్రకాశరావు, వల్లపు వెంకన్న, బుసా చంద్రశేఖర్, పెద్దినేని రాధాకృష్ణ, ఎండి అస్లాం, పవన్, బాలా,అప్పారావు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌లోకి మహేంద్ర థార్‌రాక్స్, సీఎన్‌జీ బైక్‌లు

- ఆవిష్కరించిన కమిషనర్ అభిషేక్, వీవీసీ సంస్థల ఎండీ రాజేంద్రప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహితం కోసం వాహనాలను ప్రవేశ పెట్టిన వీవీసీ మోటార్స్ సంస్థలు అభినందనీయమని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య అభినందించారు. శనివారం వీవీసీ మోటార్స్ మెనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్(రాజా)తో కలిసి ఖమ్మం వీవీసీ మోటార్స్‌లో మహేంద్ర థార్‌రాక్స్ కార్లును, 2 మోడల్స్ సీఎన్‌జీ బైక్‌లను ఆవిష్కరించారు. పెట్రోల్, డీజిల్ స్థానంలో విద్యుత్, సీఎన్జీ వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. కొత్తతరానికి ఆధునిక ఫ్యూచర్లతో మహేంద్ర థార్ రాక్స్ వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు వీవీసీ సంస్థల ఎండీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటికే దేశీయ మార్కెట్‌తో పాటుగా అంతర్జాతీయ మార్కెట్‌లో తార్‌కు తిరుగులేని మార్కెట్ డిమాండ్ ఉందని, ఆధునిక హంగులతో ఐదుడోర్లుతో మహేంద్ర తార్‌రాక్స్ ఇప్పుడు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. వీవీసీ సంస్థల చైర్మన్ ద్రౌపతి, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, కార్పొరేటర్లు రఫీదాముస్తాఫా, మిక్కిలినేని మంజులనరేందర్, సీఐ బాలకృష్ణ పాల్గొన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న కమిషనర్ అభిషేక్‌ఆగస్త్య, వీవీసీ సంస్థల ఎండీ రాజేంద్రప్రసాద్

బలమైన కార్మిక ఉద్యమాల కోసమే విలీనం

- ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్

ఖమ్మం సంక్షేమ విభాగం,రఘునాథపాలెం,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో బలమైన కార్మిక ఉద్యమాల కోసమే టీయూసీఐలో ఇఫ్టూ విలీనం జరుగుతుందని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరం, రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన పలు సభల్లో ఆయన విలీన కరపత్రాలను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల కార్మికులు, అసంఘటిత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలంటే జాతీయ స్థాయిలో ఉద్యమాలు జరగాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. నేడు హైదరాబాద్‌లో జరిగే విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కరుణకుమారి, కోటిలింగం, విజయకుమారి, జ్యోతి, శిరీష, రేణుక, చంద్రకళ, కళావతి, విజయకుమారి, మల్లేశ్వరి, నవ్య పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
ఆదివారం 20 అక్టోబరు 2024
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

'ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి'

వైరా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఈనెల 21న జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ పిలుపునిచ్చారు. వైరాలో శనివారం మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల పోస్టర్లను వైరాలో పలు చోట్ల అంటించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు గుడిమెట్ల రజిత, తోట కృష్ణవేణి, వేదగిరి కళావతి, మల్లికాంబ, కృష్ణకుమారి, విజయ, ప్రమీల, అమృత పాల్గొన్నారు.

ప్రజాపాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు

» ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ రాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాపాలనలోనే పేదల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌లు పేర్కొన్నారు. శనివారం వైరా రిజర్వాయర్‌లో ఏడు లక్షలకు పైగా ఉచిత చేప పిల్లలను ఎంపీ, ఎమ్మెల్యే విడుదల చేశారు. అంతకముందు బీసీ సంక్షేమ, ఎక్సైజ్‌శాఖల ఆధ్వర్యంలో గీత కార్మికుల రక్షణ కవచ కిట్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు అన్ని రకాల వృత్తిదారుల సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, ఏడీఎఫ్ జి.శివప్రసాద్, ఎక్సైజ్ డీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి జ్యోతి, జిల్లా చేపల సొసైటీ కన్వీనర్ మామిడి వెంకటేశ్వర్లు, వైరా చేపల సొసైటీ అధ్యక్షుడు షేక్.రహీం, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఏడీఏ టి.కరుణశ్రీ, ఐబీ డీఈ పి.శ్రీనివాస్, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పణితి సైదులు, శ్రీను, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

» బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది » ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు



ముదిగొండలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయం

ముదిగొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో కీలకంగా సేవలు అందించే ముదిగొండ తహసీల్దార్ కార్యాలయం, పశువైద్యశాల, గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకొని సమస్యలకు నిలయాలుగా మారాయి. ఎప్పుడో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. సేవలు పొందటానికి వచ్చే ప్రజలు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రత్యేకంగా నిర్మించకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలోనే అరకొర వసతులు కలిగిన అద్దె భవనంలో కొనసాగుతుంది. ఈ కార్యాలయం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరి భవనం స్లాబ్ పెచ్చులు పలుమార్లు ఊడిపడటం జరిగింది. దీంతో సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాల, గ్రంథాలయం, పోలీస్‌స్టేషన్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయశాఖ కార్యాలయాలను ఎప్పుడో నిర్మించడంతో అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురిసినప్పుడల్లా కార్యాలయాల్లోకి నీరు చేరడంతో ఎప్పుడు కూలుతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరగా బీటలువారిన గోడలు, పైకప్పు నుంచి వర్షం నీరు గదుల్లోకి చేరడంతో సిబ్బంది విధులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో రికార్డులు అలాగే పశువైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిల్వ ఉంచిన మందులు సైతం తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. కొన్ని భవనాలకు నామమాత్రంగా మరమ్మతులు చేపట్టినప్పటికీ చిన్న వర్షానికి కూడా కురుస్తున్నాయి. నిత్యం ప్రజలకు ఉపయోగపడే మండల కేంద్రంలో ఉన్న ఈ కార్యాలయాలు ఇలా ఉండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని మండల ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.



తల్లాడలో కూలే దశలో ఉన్న ఎన్నెస్పీ పాత భవనం

తల్లాడలో....

తల్లాడ: నాలుగున్నర దశాబ్దాల క్రితం తల్లాడలో నిర్మించిన నాగార్జున్‌సాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) భవనాలు, మల్లవరంలో విద్యుత్‌శాఖ భవనాలు శిథిలావస్థకు చేరాయి. పగుళ్లు వచ్చి కూలే దశలో ప్రమాదకరంగా మారాయి. పాత భవనాల మధ్యలో దట్టంగా పిచ్చిమొక్కలు, చెట్లు పెరిగాయి. 1977వ సంవత్సరంలో తల్లాడలో ఎన్నెస్పీ భవనాలు నిర్మించారు. 1976లో మల్లవరంలో విద్యుత్‌శాఖ భవనాలు నిర్మించారు. నిర్వహణ లేకపోవడంతో క్రమేణా భవనాలు శిథిలావస్థకు చేరాయి. జననివాసాల మధ్య శిథిలావస్థలో ఉన్న భవనాలు ఎప్పుడు కూలుతాయోననే ఆందోళన స్థానికుల్లో నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'దేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్‌టాటా'



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చింతకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రతన్ నావెల్ టాటా దేశం గర్వించదగ్గ వ్యక్తి అని నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో రతన్ టాటా జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రతన్ టాటా ఒక గొప్ప వ్యాపారవేత్త, మానవతావాది అని అన్నారు. సమయపాలన విలువ తెలిసిన వ్యక్తి అని, ఈ దేశ కీర్తి ప్రతిష్ఠలను వ్యాపార దక్షతను ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

విద్యార్థులు రతన్‌టాటాను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన సూచించారు. ఆయన మృతి పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌనం పాటించారు. రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి'

తల్లాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. శనివారం తల్లాడ మండలంలో కొత్తగా విధుల్లో చేరిన 27మంది ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర సహాయాధ్యక్షుడు రాయల నర్సింహారావు, జిల్లా కార్యదర్శి నున్నా శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాలకృష్ణ, శర్మ, కె.భాస్కర్, కె.వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

మధిర: నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్ బ్రహ్మారెడ్డి సూచించారు. శనివారం మధిరలోని సంఘ కార్యాలయంలో జరిగిన నూతన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, రాష్ట్ర బాధ్యులు డీ. వెంకటేశ్వరరావు, షేక్ . మదార్, టీ. కృష్ణారెడ్డి సీహెచ్‌వీ. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



దాత సాధిక్‌అలీని సన్మానిస్తున్న విద్యార్థులు

కల్లూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.75 వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను ఆ సంస్థ అధినేత యస్‌కె సాధిక్‌అలీ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత సాధిక్‌అలీని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగపద్మ, ఉపాధ్యాయులు వరక రామారావు, రమాదేవి, మామిడాల వెంకటేశ్వరరావు అనిత, ఫణీ శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వైరా, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన గుడిపాటి రత్తమ్మ అంత్యక్రియల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. రత్తమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ ఆర్థిక చేయూతనిస్తుందని నిర్వాహకుడు నిమ్మతోట జాన్ తెలిపారు.

వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్‌విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఓ దివ్యాంగురాలికి వీల్ చైర్, ఓ విద్యార్థినికి ఆర్థికసాయం అందజేశారు. గ్రేట్ విజన్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆరోవార్డు కౌన్సిలర్ లగడపాటి లక్ష్మీరాజ్యం ఆర్థికసాయంతో గొల్లెనపాడుకు చెందిన దివ్యాంగురాలు కంచర్ల నాగేంద్రమ్మకు వీల్ చైర్ అందజేశారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తాటిపూడికి చెందిన రామాంజరపు రాధకు డీఎస్సీ కోచింగ్ నిమిత్తం ఉండ్రు శ్యాంబాబు రూ.ఐదువేల ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, మరికంటి రాంగోపాల్, పి.ఉపేందర్, సీహెచ్. వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, వై.రాజారావు, వరలక్ష్మి, కిషన్, పుల్లారావు, మహాలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

ఏన్కూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. లచ్చగూడెం గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు అప్పులపాలయ్యారని ఆవేద వ్యక్తం చేశారు. రూ.లక్ష రుణమాఫీ చేయడానికి పదేళ్లుపట్టిందని ఆరోపించారు. కేవలం 8నెలల కాలంలో రూ.18వేల కోట్ల రుణమాఫీ చేయడం గర్వకారణమన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో నాగలక్ష్మి, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేష్, ఏవో నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, మేడా ధర్మారావు, బానోతు రామారావు, వెంకన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఏన్కూరు మండలంలోని మూన్యతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాలోతు బామన తల్లి మోతీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ బామన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

గిరిజన సమ్మేళనంలో భాగస్వాములు కావాలి

వైరా, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నవంబరు 5న ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి గిరిజన సమ్మేళనంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. శనివారం వైరాలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగే సమ్మేళన ప్రచార కరపత్రాన్ని ఆసంఘం రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామావత్ శ్రీరాంనాయక్, భూక్యా వీరభద్రంతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకుడు మచ్చా బుజ్జీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాణోతు బాలాజీనాయక్, నాయకులు మూడ్ గన్యానాయక్, బాణోతు హరిచంద్, గుగులోతు వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఏన్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వాటర్ ప్లాంట్ వితరణ

ఎర్రుపాలెం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం హైదరాబాద్‌కు చెందిన విజయశ్రీ మినరల్‌వాటర్ ప్లాంట్‌ను శనివారం వితరణ చేశారు. రూ.1,50,000ల విలువగల వాటర్ ప్యూరీఫైర్‌ను హెచ్‌ఎం శ్యామ్‌బాబుకు అందించారు. దాత విజయశ్రీకి పలువురు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకరరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మారాబత్తుల మోహన్‌రావు, బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, ఎం.వెంకటేశ్వరరావు, సత్యవతి, శ్రీనివాసరెడ్డి, తలపు రెడ్డి నాగిరెడ్డి, పీడీ మారాబత్తుల జమలయ్య, భూమయ్య, వెంకమ్మ, శైలజకుమారి, పుల్లయ్య, బాబీ, శంకరయ్య పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్



చైర్‌పర్సన్ లతను మర్యాద పూర్వకంగా కలిసిన కమిషనర్

మధిరటౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపల్ కమిషనర్‌గా సంపత్ కుమార్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లతను ఆమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా ఉన్న షఫీఉల్లాను ఖమ్మం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ కాగా, అక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న సంపత్ కుమార్‌ను మధిర కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ నియమించారు.

బోనకల్ విద్యుత్ ఏఈగా మనోహర్

బోనకల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్‌శాఖ ఏఈగా మనోహర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏఈగా పని చేసిన ఉమామహేశ్వరరావు బదిలీపై ఖమ్మం వెళ్లగా, అక్కడ నుంచి మనోహర్ బోనకల్‌కు వచ్చారు.

కుట్టుమిషన్ పంపిణీ

వైరా, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మిట్టపల్లి లక్ష్మికి శనివారం ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ కుట్టుమిషన్‌ను అందజేశారు. ఓరోగికి 25 కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, సత్యంబాబు, ప్రసాద్, నాగి, రమణ, రాంబాబు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేశాం

» మునిసిపల్ కమిషనర్ చింతా వేణు



మాట్లాడుతున్న కమిషనర్ వేణు

వైరా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన ప్రక్రియను వేగవంతం చేశామని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు తెలిపారు. శనివారం ఖమ్మం డీటీసీపీవో ప్రసాద్ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్‌తో కలిసి ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన తీరుపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. మునిసిపాలిటీలో 3,516 మంది రూ.వెయ్యి చొప్పున చెల్లించి, ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే 1,086మంది దరఖాస్తులను పరిశీలించామని పేర్కొన్నారు. ఫీజు చెల్లింపు కోసం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించామని ఇప్పటికే 30మంది ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రతులను ఆన్‌లైన్‌లో పొందారని వివరించారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ఐబీ ఏఈఈ వెంకట్రామ్, టౌన్‌ప్లానింగ్ అధికారి ఇటుకాల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఈఏపీసెట్, నీట్ ర్యాంకులు సాధించాలి

» జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ అధికారి రవిబాబు

ముదిగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఈఏపీసెట్, నీట్ ర్యాంకులు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె.రవిబాబు సూచించారు. శనివారం ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. సైన్స్ విద్యార్థులు తప్పనిసరిగా ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రెన్స్ రాసి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఆర్ట్స్ విద్యార్థులు ప్రముఖ జాతీయ యూనివర్సిటీల్లో సీటు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాన్ని పరిశీలించి సైన్స్ విద్యార్థులందరికీ ఈఏపీసెట్, నీట్ పుస్తకాలను ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

చింతకాని, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు మనోహర్‌బాబు, కిషోర్, గోవిందరావు, సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కొణిజర్ల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బొంతు రాంబాబు కోరారు. మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో పాషా అధ్యక్షతన జరిగిన గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం గ్రామశాఖ కార్యదర్శులుగా అనుమోలు రామారావు, సంక్రాంతి పురుషోత్తం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదనరావు, చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, నరసింహరావు, బాబు, గోపాలరావు, రహీం, చిన్నబాబు, బ్రహ్మేశ్వరరావు, ప్రభాకర్, రాందాస్ తదితరులున్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

బోనకల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఎస్సీ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహ ఊరేగింపును శనివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, లింగాల కమలరాజులు ఊరేగింపును ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ, సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరావు, గుండపనేని సుదాకరరావు, పోటు వెంకటేశ్వర్లు, వేమూరి ప్రసాద్, తెల్లాకుల శ్రీనివాస్, గుగులోతు రమేష్, గుగులోతు నాగేశ్వరావు, తాటికొండ వెంకటరత్నం, తేళ్లూరి రమేష్, మందా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బంజార సంప్రదాయ నృత్యాలు చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు